సూర్య
18వ
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం,30 జనవరి 2025


# ప్రజా కవి గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన విష్ణువర్ధన్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

### - జేఏసీ అధ్యక్షులు బొంత శ్యామ్ రవి ప్రకాష్ డిమాండ్



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** ప్రజా ఉద్యమంలో తన కలంతో గళం విప్పి, ప్రజా చైతన్యాన్ని తీసుకువచ్చి, నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేసిన మహా యోధుడు ప్రజా కవి గద్దర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్, బిజెపి నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి క్షమాపణ చెప్పాలని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ అధ్యక్షులు బొంత శ్యామ్ రవి ప్రకాష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డులపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విష్ణువర్ధన్ రెడ్డి ప్రజా కవి గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల బుధవారం బొంత శ్యామ్ రవి ప్రకాష్ మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డులు బిజెపి పార్టీకి చెందినవి కాదని గుర్తు చేశారు. పద్మ అవార్డులు ఎంపికలో కమిటీ ఉంటుందని ఆ కమిటీ సిఫార్సు చేసిన వారికి అవార్డులను ప్రకటించడం జరుగుతుందన్నారు. ఇది కేవలం బిజెపి మాత్రమే ఇచ్చిన అవార్డులుగా బండి సంజయ్ మాట్లాడడం సబబు కాదన్నారు. చనిపోయిన వ్యక్తిపై ఇష్టానుసారంగా మాట్లాడిన బండి సంజయ్ విష్ణువర్ధన్ రెడ్డి ప్రజా కవి గాయకుడు గద్దర్ కుటుంబానికి అభిమానులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఎక్సైజ్‌లో రెన్యూవల్ కిక్కు




## సీఐలే వసూల్ రాజాలు



- లైసెన్సుల మంజూరులో మామూళ్ళు..!
- ఒక్కో మద్యం షాపుకి లక్ష పైనే వసూలు
- క్రింది నుంచి పైస్థాయి వరకు లంచాలు పంపకాలు
- ఎక్సైజ్ సీఐ లే వసూల్ రాజాలు
- వైన్‌షాపులు బార్‌లను తలపిస్తున్నా... అటువైపు చూస్తే ఒట్టు
- లంచాలు కారణంగానే విచ్చలవిడిగా బెల్టు షాపులు
- సిండికేట్ చీకటి దందా !
- అక్రమ వసూళ్ళపై విచారణ చేయిస్తా : ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

**సూర్య బ్యూరో - ఉమ్మడి గోదావరి జిల్లాలు :** 'అడిగినంత కొట్టు... నీవైపు చూస్తే ఒట్టు' అన్నట్లుగా ఉంది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఎక్సైజ్ అధికారుల తీరు.. మద్యం అక్రమ అమ్మకాలను అరికట్టాల్సిన సిఐలు, ఈఎస్‌లు..ఆక్రైం నిరోధించడంలో తమకు సంబంధమే లేదన్నట్లుగా 'మామూలు'గా వెళ్ళిపోతున్నారు.ఉన్నతాధికారులకు,ఎస్‌టిఎఫ్‌కి లంచాలు ఇవ్వాల్సి ఉందంటూ..అందరి వాటాలు కలిపి భారీగా 'రేటు' ఫిక్స్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం..కూటమి ప్రభుత్వం ఏర్పడి, మద్యం అమ్మకాలను ప్రైవేటు పరం చేసి, లాటరీ ద్వారా షాపుల కేటాయింపు చేశారు. మద్యం షాపుల లాటరీ ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం తెచ్చిపెట్టిన ఎక్సైజ్ శాఖ ఇప్పుడు తమ సొంత ఖజానా నింపుకొనే పనిలో నిమగ్నమైంది. మద్యం షాపుల లాటరీ ప్రక్రియ పూర్తికావడం, షాపుల కేటాయింపు జరగడం, తాత్కాలిక లైసెన్సులతో కాకినాడ జిల్లాలో 155, తూర్పుగోదావరి జిల్లాలో 125, కోనసీమ జిల్లాలో 133 షాపులు తెరవడం.. ఇదంతా యధా మామూలుగా సాగినా, రెండేళ్ళపాటు మద్యంషాపులు నిర్వహించేందుకు పూర్తిస్థాయి లైసెన్సు మంజూరులో రెన్యూవల్ పేరుతో లంచాల అసలు కథ మొదల్కెంది. ఈ రెన్యూవల్ ల్కెసెన్సు మంజూరు కోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలలోని 413 షాపులలో ఎక్సైజ్ శాఖ మామూళ్ళ కిక్కు వెలుగులోకి వచ్చింది. ఒక్కో ల్కెసెన్స్ రెన్యూవల్‌కి రెండు లక్షలు డిమాండ్ చేసి చివరికి లక్ష ఐదువందలు అందుకొన్నారు. ఇందుకు కిందిస్థాయివారు వసూళ్ళ పర్వం నడిపిస్తుండగా... ఈ కథ లో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వరకు వాటాల పరంపర జరుగుతుందని ఆశాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి గోదావరి జిల్లాలో ఎక్సైజ్ శాఖలో రెన్యూవల్ పేరుతో జరుగుతున్న మామూళ్ళ దందాపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం...

- మిగతా 2 లో..



కిక్కు శాఖలో రెన్యూవల్ పండుగ

## మండలంలో 9 మంది రేషన్ డీలర్లు నియామకం

### - తాహసిల్దార్ సత్యనారాయణ



**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** మండలంలో 9మంది రేషన్ డీలర్లును నియమించినట్లు తాహసిల్దార్ అల్లు సత్యనారాయణ బుధవారం తెలిపారు. మండలంలో9 నిత్యవసర వస్తువుల పంపిణీ కేంద్రాలో డీలర్లను నిమిస్తూ రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్ప శ్రీ ఆదేశాలు జారీ చేసినట్లు ఉత్తర్వు లు వచ్చాయని ఆయన తెలిపారు. మండలంలోని గడువోకుర్తి పంచాయతీచెడిపాలెం రేషన్‌డీలర్‌గా మైలబోయిన శివరాం ప్రసాద్, గొబ్బిలిమడుగుకు చలుమూర్తి లోవభవాని, జడ్డంగి పంచాయతీ చెన్నయ్యపాలెంకు కోపూరి మల్లేశ్వరి, చికలింత పంచాయతీ కరుదేవ పాలింకు మేలిన వెంకటలక్ష్మి, కొండపల్లి పంచాయతీ కే మర్రిపాలెం కు కుంజం బాలకృష్ణ, చెరుకుంపాలెం పంచాయతీకే వెలగలపాలింకుమామిడి లోవరాజు, లబ్బర్తి పంచాయతీ నెల్లిమెట్ల కాలనీకి పొడుగు దుర్గాదేవి, రాజవొమ్మంగి రెండవ డిపోకుసొర్లం సింధు, తంటి కొండ గ్రామానికి మిరియాల భరత్ కుమార్ కు నియామక పత్రాలు అందచేయనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. వీరందరూ గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేషన్ డిపోలో పని చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

## అక్రమంగా నిర్మించిన బిల్డింగ్‌ని తక్షణమే ఆదివాసి కార్యాలయానికి అప్పగించాలి



**చింతూరు, మేజర్ న్యూస్ :** ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ స్థాయి సమావేశం స్థానిక చింతూరు డివిజన్ కేంద్రంలో, మండల అధ్యక్షులు, సోడె ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బంగారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, చింతూరు కేంద్రంగా గిరిజ నేత్రులు ఆదివాసి భూములలో బినామీ పేర్లతో అనేక అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న, ప్రభుత్వ అధికారులు మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్టుగా వ్యవహరిస్తూ, చట్ట వ్యతిరేక చర్యలకు సపోర్ట్ చేస్తూ, ఆదివాసి చట్టాలను తూట్లు పొడుస్తున్నారన్నారు. సంక్షేమ పరిషత్ కార్యాలయ విషయంలో అధికారులు, విఫలమయ్యారని, ఆదివాసి సంక్షేమ పరిషత్‌కి కేటాయించిన స్థలంలో బినామీ పేరుతో ఒక గిరజనేత్రుడు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తా ఉంటే అడ్డుకోబోయిన ఆదివాసి సంక్షేమ పరిషత్ కార్యకర్తలపై గిరిజనేత్రుడు బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఆదివాసుల పేరున బినామీగా అనేక షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తూ, ఆదివాసి చట్టానికి తూట్లు పొడుస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతున్నాడన్నారు. ఆక్రమించిన ఆ యొక్క అక్రమ భవనాలు అన్ని తక్షణమే ప్రభుత్వం సీజ్ చేసి స్వాధీనపరుచుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్ చేస్తుందన్నారు. 1/70, చట్టానికి విరుద్ధంగా ఉన్నటువంటి కట్టడాలను తక్షణమే ప్రభుత్వం సీజ్ చేయాలని అదేవిధంగా, చట్టవ్యతిరేకంగా ఇచ్చిన అధికారులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్ చేస్తుందన్నారు. అదే విధంగా ఆదివాసి సంక్షేమ పరిషత్‌కి కేటాయించిన స్థలంలో నిర్మించిన అక్రమ భవనాన్ని ఆదివాసీ సంక్షేమ పరిషత్‌కి కేటాయించాలని, లేని పక్షాన ఆదివాసి సంక్షేమ పరిషత్ తీసుకునే చర్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ నాయకులు పూనం చిన్న వీరభద్రం, కుంజా శ్రీను, శీలం కృష్ణ డివిజన్, మరియు మండల నాయకులు సోడి రాఘవయ్య, చవలం కోటేశ్వరరావు, పాయం నాగరాజు, దుమ్మిరి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 31న పిఠాపురంలో మినీ జాబ్ మేళా




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా లోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పిఠాపురం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 31 వ తేదీన "మినీ జాబ్ మేళా" నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్ మరియు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం. కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో... (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్, మెడ్ ప్లస్ ఫార్మసీ, ఎల్ఐసి ఆఫ్ ఇండియా) కంపెనీలు హాజరుకానున్నాయని తెలిపారు. వీటిలో గల వివిధ ఉద్యోగాలలో పనిచేయడానికి పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, డిబిఎం ఫార్మసీ పూర్తి చేసిన 19 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు గల వారు అర్హులని, " జాబ్ మేళా" కు హాజరయ్యే అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా సదరు ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆసక్తి, తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా వెబ్‌సైట్ నందు తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయ్యి సదరు " జాబ్ మేళా" కు రెజ్యూమ్ లతో పాటు ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో... ఈనెల 31 వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ వద్దకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు "86399 51441," 99491 56583" నంబర్లలో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటలలోపు సంప్రదించాలని సూచించారు.

## సమాజ సేవయే పరమావధిగా పనిచేస్తున్న వాసవి క్లబ్



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** సమాజ సేవయే పరమావధిగా వాసవి క్లబ్ పనిచేస్తుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్ దర్శి శ్రీనివాస్ గుప్తా అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కొవ్వూరు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని కొవ్వూరు ఆర్యవైశ్య కళ్యాణమండపం లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొవ్వూరు వాసవి క్లబ్ అధ్యక్షునిగా మన్యం వీరభద్ర గుప్తా, కార్యదర్శిగా సత్యవరపు గురునాథ్, కోశాధికారిగా సత్యవరపు భరత్ కుమార్, గౌరవ అధ్యక్షులుగా దేవతు కృష్ణ ప్రసాద్ లచే వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ చలగంట్ల ఎన్ వి ఎస్ ఎస్ ప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ నూతన అధ్యక్షులు మన్యం వీరభద్ర గుప్తా మాట్లాడుతూ సమాజంలో అవసరాలను గుర్తించి సహాయ సహకారాలు అందించడంలో నిరంతరం కృషి చేస్తానని అన్నారు. సేవయే పరమావధిగా పనిచేస్తూ క్లబ్ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వలివేటి ఎల్ ఎన్ వి ప్రసాద్, క్యాబినెట్ సెక్రటరీ ఎస్ వి .చలపతిరావు, క్యాబినెట్ ట్రెజరర్ చల్లగంట్ల వెంకటేశ్వరరావు, వయసు గవర్నర్ కేదార శెట్టి రవికుమార్, డిస్టిక్ ఇన్చార్జి గ్రంధి గంగాధర ప్రవీణ్, రీజియన్ చైర్మన్ ఆలపాటి అచ్యుత లక్ష్మి, జోన్ చైర్మన్ కాకి అనిల్ సూర్య, కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మట్టే వీర వెంకట ప్రసాద్, కార్యదర్శి కొల్లేపర శ్రీనివాస్ కోశాధికారి తుమ్మలపల్లి రమేష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు మద్దుల సత్యనారాయణ,కక్కిరాల సోమయ్య, వంకాయల శివరామకృష్ణ, బంగారు కాశి అన్నపూర్ణ,మద్దుల నాగమణి, తదితర ఆర్యవైశ్య సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవుని దర్శించుకున్న ఎస్పీఎఫ్ ఐజీ బీవీ రామిరెడ్డి



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దర్శనార్థం ఎస్పీఎఫ్ ఐజీ బీవీ రామిరెడ్డి శ్రీ స్వామివారి సన్నిధికి విచ్చేశారు. ముందుగా ఆలయ అర్చకులు, ఏఈఓ దామొర్ల కృష్ణారావు, ఆలయ మర్యా దలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఏఈఓ కృష్ణారావు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ సుబ్రహ్మణ్యం, జగన్నాథం, టెంపుల్ ఇన్స్పెక్టర్ గణపతి పాల్గొన్నారు.

# ఏపీని అప్పుల ఊబిలో ముంచిన జగన్

### - పది లక్షల కోట్ల అప్పును జనం నెత్తిన పెట్టిన జగన్ సర్కార్
### - అప్పులు, వడ్డీల భారం మోస్తున్న ఎన్డీయే ప్రజా ప్రభుత్వం
### - ఈ కష్టాలను అధిగమించి సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు అందించేది చంద్రబాబే
### - ఎమ్మెల్యే సత్యానందరావు



**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** ఏపీని అప్పుల ఊబిలో ముంచి సర్వ నాశనం చేసింది జగనే అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం ఎమ్మెల్యే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ పది లక్షల కోట్ల అప్పులు చేసి జగన్ సర్కార్ జనం నెత్తిన పిడుగు భారం మోపిందని మండిపడ్డారు. తెలుగుదేశం, జనసేన, భాజపా కూటమి ప్రభుత్వం గడిచిన ఏడు నెలల్లో జగన్ సర్కార్ పెట్టిన 22 వేల కోట్ల రూపాయల బకాయిలను చంద్రబాబు నాయుడు విడుదల చేసినట్లు గుర్తు చేసారు. జగన్ చేసిన అప్పుల భారం వల్ల ఏటా 71వేలకోట్ల అసలు, వడ్డీతో కలిపి లక్షా 40 వేల కోట్లు చెల్లింపుల భారం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల బకాయిలు 20 వేల కోట్లు, ఇరిగేషన్ కాంట్రాక్టర్ల బకాయిలు 19 వేల కోట్లు, గృహ నిర్మాణం బకాయిలు 78 వందల కోట్లు, ఆరోగ్యశ్రీ బకాయిలు 18 వందల కోట్లు, డిగ్రీ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు 2832 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని చెప్పారు. ఇలా మొత్తం 1.40 లక్షలకోట్లు బకాయిలు జగన్ ప్రభుత్వం పెట్టిందని వివరించారు.

**జగన్ జల్సాలు, విలాసాలకు ప్రభుత్వ సొమ్ము దుబారా**

జగన్ తన జల్సాలు, విలాసాలకు ప్రభుత్వ సొమ్మును భారీగా దుర్వినియోగం చేశారని ఆరోపించారు. భారం సుమారు 20 వేల కోట్లని చెప్పుకొచ్చారు. సెంటు పట్టాల పేరుతో 7 వేల కోట్లు, రేషన్ బియ్యంలో 7 వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. తాడేపల్లి ప్యాలెస్ సెక్యూరిటీకి, సాక్షి పేపర్ ప్రకటనలకు ఇలా చెప్పుకుంటూ పోతే జగన్ విలాసాలకు 19,871.35 కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని విలాసాలకు ఖర్చు చేశారని తెలిపారు.

**జగన్ రెడ్డి కుటుంబం 8 లక్షల కోట్ల లూటీ**

అయిదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ రెడ్డి కుటుంబం 8 లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేసిందని సత్యానందరావు ఆరోపించారు. భూ కేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ అనుమతులు వంటి వాటి ద్వారా తన కుటుంబ సభ్యులకు జగన్ దోచిపెట్టారని చెప్పారు.

లిక్కర్‌లో దోచుకుని దాచుకున్న సొమ్మును జగన్ రెడ్డి తన ఖాతాలో వేసుకున్నారని ఆరోపించారు. అన్ని రకాలుగా 8 లక్షల ప్రజాధనాన్ని జగన్ లూటీ చేశారని విమర్శించారు. ఇన్ని కష్టాలను అధిగమించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజలకు సంక్షేమాన్ని అందించగల సమర్థ నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని, అందుకే రాష్ట్ర ప్రజలంతా ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తుల రాంబాబు, బండారు సంజీవ్, బూసి భాస్కరరావు, మెర్ల లక్ష్మీపతి, సాధనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పీఠికాపుర కళావేదికపై "పురూలియా చౌ" నృత్య ప్రదర్శన

### - అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న కళాకారులు

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** శ్రీ సంగమేశ్వర సంగీత సమాఖ్య ఆధ్వర్యంలో... పిఠికాపుర కళావేదిక, బాదం ఉదయ సూర్య ప్రకాశ్ లక్ష్మి %ం% సన్ ప్రాంగణం, శ్రీ సూర్య రాయ విద్యా నంద గ్రంథాలయం, పిఠాపురంలో మొట్టమొదటి సారిగా 98 దేశాలలో ప్రదర్శనలిచ్చిన కని వినీ ఎరుగని అద్భుతమైన సాంప్రదాయ జానపద నృత్య రూపకం 'పురూలియా చౌ' కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని గట్టి శ్రీకృష్ణ దేవరయలు, బాదం ఉదయ సూర్య ప్రకాశ్, వెన్నపు చక్రధరరావు, వసంత ప్రసాద్, రాయవరపు సుబ్బారావు, సీతా లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పురూలియా చౌ' అనేది భారత దేశంలో పశ్చిమ బెంగాల్ కు చెందిన సెమి క్లాసికల్ జానపద నృత్యం. ఈ నృత్యంలో అనేక విన్యాసాలు మరియు యుద్ధానికి సంబంధించిన కదలికలతో పురాణాలకు సంబంధించిన కొన్ని కథల ఆధారంగా కళాకారులు అనేక రంగులతో కూడిన దుస్తులు, మాస్కులు వేషాలకు తగ్గట్టుగా ధరించి, మొహురి, షెహనాయ్ వంటి సంగీత వాయిద్యాలు, రకరకాల తాళ వాయిద్యాలతో డోల్, ధుమ్సా, ఖర్క, మొదలైన తాళ వాయిద్యాలను ఉపయోగించి ప్రదర్శిస్తారు. పురూలియా చౌ' ని 2010లో యునెస్కో వారు వారసత్వ సంపదగా గుర్తించడం జరిగింది. మహిషాసుర మర్ధిని, అభిమన్యు వధ కథలను



పీటికాపుర కళావేదికపై ప్రదర్శించారు. కార్యక్రమంలో... మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కొండేపూడి శంకర్రావు, అల్లవరపు నగేష్ మరియు ఆగంటి ప్రభాకర్, రామ చంద్రరావు,ప్రసాద్ మరియు కళాకారులు,కళా ప్రియులు పాల్గొన్నారు.

## శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యంగిర హెూమం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం క్షేత్ర పాలకురాలైన శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యంగిర హెూమం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వైదిక కమిటీ సభ్యులు పురోహితులు అర్చకుల ఆధ్వర్యంలో జరిపించే ప్రత్యంగిరా హెూమం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సుదీర్ఘంగా రెండు గంటలపాటు నిర్వహించారు. పూజలో అన్ని రకాల పండ్లు పూజా ద్రవ్యాలు కలిపి మూటగట్టి పూర్ణాహుతితో అగ్ని దేవునికి సమర్పించి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు కుటుంబ సమేతంగా, ఐవి రామారావు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

**– అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగరంలో ఉన్న చిన్న, మధ్యతరగతి వ్యాపారస్తులకు సంబంధించి జరుగుతోన్న ఎం.ఎస్.ఎం.ఈ. సర్వేను సకాలంలో పూర్తి చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్ సూచించారు. బుధవారం కాకినాడ నగరంలో ఉన్న పలు సచివాలయాల్లో ఆయన ఎంఎస్ఎంఈ సర్వేపై సచివాలయ ఉద్యోగులను ఆరా తీశారు. ఈనెల 31 లోపు సర్వేలు పూర్తి చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కాకినాడ నగరంలో ఉన్న చిన్న, మధ్యతరహా వ్యాపారస్తులు అందరూ ఈ సర్వేకు సహకరించాలని అడిషనల్ కమిషనర్ కె.టి.సుధాకర్ కోరారు. సర్వే సకాలంలో చేయనివారిపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

## బీటెక్ ప్రథమ మరియు తృతీయ సంవత్సరం విద్యార్థులకు స్పార్క్ ఓరియంటేషన్-2 ప్రోగ్రామ్

కాకినాడ,మేజర్న్యూస్ : జెఎన్టియుకె ప్రాంగణంలో బుధవారం అలుమ్ని ఆడిటోరియం నందు సుబు కోట ఫౌండేషన్మరియు క్రాస్ బోర్డర్స్ సహకారంతో విశ్వవిద్యాలయాలలోని విద్యార్థులను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా బీటెక్ ప్రథమ మరియు తృతీయ సంవత్సరం విద్యార్థులకు స్పార్క్ ఓరియంటేషన్–2 ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్ఛార్జి ఉపకులపతి ప్రొ.కెవిఎస్జి.మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేయగా గౌరవ అతిథిగా సుబు కోట ఫౌండేషన్ ఛైర్మన్ సుబు ఎం.కోట, అతిథులుగా ఇన్ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్, ఓఎస్డి ప్రొ.డి.కోటేశ్వరరావు,ఐక్యూఏసి ఇన్ఛార్జి డైరెక్టర్ ప్రొ.ఎంహెచ్ఎం.కృష్ణప్రసాద్, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.జివిఎస్ఆర్.దీక్షితులు, పూర్వ విద్యార్థి పార్థసారథిలు విచ్చేశారు. క్రాస్ బోర్డర్స్ ఫౌండర్ శ్రీ సుబ్బరాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించగా క్రాస్ బోర్డర్స్ ప్రతినిధి సిద్దార్ధ అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇన్ఛార్జి ఉపకులపతి ప్రొ.కెవిఎస్ జి.మురళీ కృష్ణ మాట్లాడుతూ జెఎన్టియుకె మరియు సుబు కోట ఫౌండేషన్ మరియు క్రాస్ బోర్డర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పార్క్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థుల సృజనాత్మకతకు మరియు వారి విజయాలకు నాంది పలుకుతుందన్నారు. వారి సృజనాత్మక మనస్సులను భవిష్యత్తు వ్యాపార నాయకులుగా రూపొందిస్తుందన్నారు. విద్యాసంస్థలలో సృజనాత్మకత, ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకతను పెంపొందించేందుకు సుబు కోట ఫౌండేషన్ మరియు క్రాస్ బోర్డర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈకార్యక్రమంఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జెఎన్టియుకె పూర్వ విద్యార్థి మరియు ప్రముఖ పారిశ్రామికవేత్త అయిన సుబు ఎం.కోట స్పాన్సర్ చేస్తున్న ఈ కార్యక్రమం యువతలో వ్యవస్థాపకత పట్ల మక్కువను రేకెత్తించే దిశగా ముందుకు వెళ్తుందన్నారు. సుబు కోట ఫౌండేషన్ ద్వారా యూనివర్శిటీలో ఎంటర్ప్రెన్యూర్షిప్ బూట్క్యాంప్స్, పరిశ్రమల సందర్శన, ఎకో సిస్టమ్ సందర్శన, ఎంపిక చేయబడిన విద్యార్థుల ఆలోచనలను





ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేయడానికి ఆర్థిక సహకారం అందించి వారి కలలను సాకారం చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులుగా మిమ్మల్ని ప్రోత్సహిస్తే జీవితంలో అసాధ్యమనేది ఏదీ ఉండదన్నారు. ప్రపంచం అంతా మీ కోసం ఎదురుచూస్తుందని, మీకు లభించే అవకాశాలను అందిపుచ్చుకునిఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. సుబు ఎం.కోట మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులలో వ్యవస్థాపక మనస్తత్వాన్ని పెంపొందించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

స్పార్క్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్లో భాగంగా యూనివర్శిటీ ఫెసిలిటేటర్గాను, పూర్వ విద్యార్థులు సహకారు (కంట్రిబ్యూటర్)లుగాను, విద్యార్థులు లబ్ధిదారులుగాను ఉంటారన్నారు. సుబు కోట ఫౌండేషన్ తదుపరి తరం వ్యవస్థాపకులకు మద్దతు, సాధికారత కల్పించడానికి తమ వంతు సహకారం అందించడంలో భాగంగానే స్పార్క్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామన్నారు. వ్యవస్థాపకత అనేది విద్యార్థులు తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు సవాళ్లతో కూడిన లక్ష్య చేదన అని వివరించారు. విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా సమాజానికి ఉపయోగపడే వినూత్న ఆలోచనలతో ముందుకు వచ్చి సృజనాత్మకమైన ప్రాజెక్ట్లను రూపొందించి మంచి వ్యవస్థాపకులుగా మారాలని ఆకాంక్షించారు. బిల్గేట్స్, స్టీవ్ జాబ్స్ వంటి వారు కూడా తమ ఆవిష్కరణలను చిన్న చిన్న ఆలోచనలతో ప్రారంభించి నేడు ప్రపంచ వ్యవస్థాపకులుగా వెలుగొందడం జరిగిందన్నారు.

ఇన్ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్రావు మాట్లాడుతూ యువతలో వ్యవస్థాపక స్ఫూర్తి, ఆవిష్కరణలను పెంపొందించడానికి జెఎన్టియుకె కాకినాడ, సుబు కోట ఫౌండేషన్ మరియు క్రాస్ బోర్డర్స్ సహకారంతో స్పార్క్ ఓరియంటేషన్–2 పేరుతో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. స్పార్క్ చొరవలో భాగంగా సుబు కోట ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుబు ఎం.కోట జెఎన్టియుకె విద్యార్థుల వ్యవస్థాపక ప్రయత్నాలను పెంపొందించడానికి రూ.కోటి నిధులను అందజేయడం జరిగిందని క్రాస్ బోర్డర్స్ ఫౌండర్ శ్రీ సుబ్బరాజు పేర్కొన్నారు. స్పార్క్ ఓరియంటేషన్–1 ద్వారా ఎంపికైన మూడు ప్రాజెక్ట్లకు మూడు సంవత్సరాల పాటు మెంటార్షిప్, నిధులు, పెట్టుబడులను అందించడం జరుగుతుందని, అలాగే స్పార్క్ ఓరియంటేషన్–2లో భాగంగా విద్యార్థి బృందాలకు ఓపెన్ ప్యానల్ చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తామని, మూడు వినూత్న ప్రాజెక్ట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుసిఇకె మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.డి.లింగరాజు, ఐఐఎస్&ఈ సెల్ కో–ఆర్డినేటర్ డా.కె.రాజశేఖర్, అధ్యాపకులు కె.రఘురాం, క్రాస్ బోర్డర్స్ ప్రతినిధి సృజన, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ కాపు సేవా సమితి జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జిగా సైతిన నాగేశ్వరరావు నియామకం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** భారతీయ కాపు సేవా సమితి జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జిగా జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామానికి చెందిన సైతిన నాగేశ్వరరావును భారతీయ కాపు సేవా సమితి వ్యవస్థాపక మరియు జాతీయ అధ్యక్షులు కాలవ వెంకటేశ్వరరావు బుధవారం నియమించి నియామ కపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ కాపు సేవా సమితి వ్యవస్థాపక మరియు జాతీయ అధ్యక్షులు కాలవ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాపుల అభ్యున్నతికి, కాపుల ఐక్యత కొరకు భారతీయ కాపు సేవా సమితి అండగా నిలుస్తుందని అలాగే జగ్గంపేట నియోజకవర్గంలో తొందరలో భారతీయ కాపు సేవా సమితి లోని అనుబంధ కమిటీలను నియామకం చేపట్టాలని తెలియజేసారు. అనంతరం భారతీయ కాపు సేవా సమితి జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జి సైతిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ముందుగా భారతీయ కాపు సేవా సమితి వ్యవస్థాపక మరియు జాతీయ అధ్యక్షులు కాలవ వెంకటేశ్వరరావుకి మరియు కాకినాడ జిల్లా అధ్యక్షులు అడబాల చక్రరావుకి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే రానున్న రోజుల్లో జగ్గంపేట నియోజకవర్గంలో భారతీయ కాపు సేవా సమితి మరియు అనుబంధ కమిటీలను పూర్తి చేస్తామని తెలిపారు.

## సైబర్ క్రైమ్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**– రోడ్డు ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలి**
**– పిఠాపురం రూరల్ ఎస్సై ఎల్ గుణశేఖర్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** సైబర్ క్రైమ్ మోసాలపై మరియు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలని పిఠాపురం రూరల్ ఎస్సై ఎల్. గుణశేఖర్ అన్నారు. పిఠాపురం మండలం రాపర్తి గ్రామంలో గ్రామస్తులకు సైబర్ క్రైమ్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల వినియోగం వాటి అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించి జరిమానా విధించారు. వాహనాలు నడిపేవారు అన్ని డాక్యుమెంట్లు అనగా.... ఆర్ సి, ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రయాణ భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో పిఠాపురం రూరల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో రోబోటిక్స్లో సత్తా చాటిన లక్ష్య విద్యార్థులు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ డిజైన్ (రాఖుణ) వారు జనవరి 23, 24 తేదీలలో నిర్వహించిన రోబోరోర్– సింగపూర్–2025 అంతర్జాతీయ పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరపున లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు. రోబోరోర్ – సింగపూర్ 2025 పోటీలలో 78 విద్యాసంస్థలు, 438 విద్యార్థులు, 91 టీమ్లు పాల్గొనగా మన ఆంధ్రప్రదేశ్ నుండి ముఖ్యంగా కాకినాడ జిల్లాకు చెందిన లక్ష్య ఇంటన్నేషనల్ స్కూల్ 8వ తరగతి విద్యార్థులు షార్ణిక, శశాంక్, విరాజ్, మనోహర్లు స్మార్ఫ్ కోడింగ్ పోటీలలో ద్వితీయ బహుమతిని సొంతం చేసుకొని అంతర్జాతీయ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ సుగుణారెడ్డి మాట్లాడుతూ లక్ష్య విద్యార్థులు ఇంటర్నేషనల్ స్థాయిలో విజేతలుగా నిలిచారని రోబోటిక్స్ని ఒక ప్రత్యేక సబ్జెక్టుగా సెకండరీ విద్యార్థులకు లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాలలో నేర్పిస్తున్నామని తెలియజేశారు. కోడింగ్ నేర్చుకోవడం వల్ల విద్యార్థులలో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని తెలియజేశారు. నేటికాలంలో రోబోల వినియోగం ప్రాచుర్యంలోకి వస్తున్నదని అందరికీ తెలిసిన విషయమే, రోబోటిక్స్ ద్వారా మానవ జీవితానికి అనేక ఉపయోగాలు ఉన్నాయి. విద్య, వైద్య, ఆరోగ్య, వాణిజ్య రంగాలలో రోబోల వినియోగం అధికంగా ఉన్నది. ఈ పోటీల వల్ల నూతన ఆవిష్కరణలు జరుగుతాయని, ప్రతిభావంతులైన విద్యార్థులకు మంచి గుర్తింపు లభిస్తున్నదని తెలియజేశారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ జనవరి 23, 24 తేదీలలో సింగపూర్లో నిర్వహించబడిన రోబోరోర్ – సింగపూర్ 2025 పోటీలలో లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు మన రాష్ట్రకీర్తిని పెంచుతూ ద్వితీయ స్థానంలో నిలిచినందుకు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ వందనా బోప్రే మాట్లాడుతూ ఆహార డెలివరీ రోబోల తయారీ విభాగంలో పాల్గొని లక్ష్య పాఠశాల విద్యార్థులు ఈకాంపిటీషన్లో బహుమతిని గెలుచుకున్నారని, మా లక్ష్య విద్యార్థులకు కోడింగ్, రోబోటిక్స్ నేర్చుకోవడం వల్ల అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని తెలియజేసి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## ఎక్సైజ్లో రెన్యూవల్ కిక్కు

1పేజి తరువాయి

నెలవారీగా భారీ మొత్తంలో జీతం కన్నా గీతం ఉండడంతో ఎక్సైజ్ అధికారులు లంచాలమత్తులో జోగుతున్నారు. మొత్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మద్యం వ్యాపారం అంతా బెల్ట్షాపుల ద్వారానే సాగుతోంది. దీంతో మద్యం ప్రియుల జేబులకు చిల్లు, ఆరోగ్యానికి తూట్లు పడుతున్నాయి.బెల్ట్షాపుల నిర్వహణ నిబంధనలకు విరుద్ధం కాగా,మొత్తంవ్యవస్థఆదుకాణాల్లో సాగుతుందంటే జిల్లాలలో ఎక్సైజ్ అధికారుల లంచాల పనితీరు ఇట్టే తెలిసిపోతోంది.

**రూ.లక్షలు వసూళ్ళు చేసి...లైసెన్సు రెన్యూవల్ !**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోముగ్గురు ఎక్సైజ్ సూపరింటెండెంట్లు ఉన్నారు.కాకినాడ,తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలలో మొత్తం 413 మద్యం షాపులు ఉండగా, ఏరియాను బట్టి, ఆయా షాపుల యజమానులు చేసే క్రైంని బట్టి ఒక్కో షాపు నుంచి రూ.లక్ష మొదలు రూ.2 లక్షల వరకు రెన్యూవల్ పేరుతో భారీగా వసూళ్ళ పర్వం నడిపారు. లాటరీలో లైసెన్స్లు దక్కినవారు తాత్కాలిక లైసెన్సులు పొంది షాపులు తెరిచారు.ఇలా మద్యం వ్యాపారం ప్రారంభించి కొన్ని నెలలు అవుతున్నందున పూర్తిస్థాయి ల్కెసెన్సులు ఇవ్వడం ఆశాఖలో ఆనవాయితీ. ఇందుకు బ్యాంకు గ్యారంటీలు, మద్యం షాపు ఏర్పాట్లు, నిబంధనలు సరిచూసుకుని ఎక్సైజ్ శాఖ ఉచితంగానే పూర్తి ల్కెసెన్స్లు రెన్యూవల్ జారీచేయాలి. కానీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అలా ప్రక్రియ సాగలేదు. రెన్యూవల్ చేయడానికి ఒక్కో షాపుకి రూ.లక్షలు లంచంగా రేటు నిర్ణయించారు.వసూళ్ళకి వచ్చేసరికి చాలాచోట్ల లక్ష యాభై చెయ్యగా మన కాకినాడ జిల్లాలో లక్ష పాతిక వేలు, రూ.లక్ష ఐదు వందలు ముడుపులు వసూలు చేసేశారు...ఇంకా ఒకరిద్దరి నుంచి వసూలు డిమాండ్ చేస్తున్నారు. 'అంత ఇవ్వలేం కొంత ఇచ్చుకుంటాం' అంటూ బేరమాడుతున్నాఎక్సైజ్శాఖ మాత్రం ససేమిరా అంటోంది.విచ్చల విడిగా బెల్ట్షాపులు పెట్టుకోండి, ఎంఆర్పిని పక్కన పెట్టండి, అదనంగా బెల్టుషాపుల నుంచిబాదండి,లాభాలు సంపాదించుకోండి... మా ముడుపులు మాకు ఇవ్వండి అన్నట్లుగా జిల్లాలలో లైసెన్స్ల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో మద్యం వ్యాపారులు ఎవరికీ చెప్పుకోలేక సతమతమవుతున్నారు.ఫిర్యాదులు చేస్తే రోజువారీ కేసులు పెట్టి లైసెన్స్కే వేటు వేస్తారని, లేదంటే షాపులు సీజ్ చేస్తారన్న భయం వ్యాపారుల్లో నెలకొంది.

దీంతో మద్యం వ్యాపారులు, సిండికేట్లు కొందరు ఎవరికి వారు ముడుపులు ముట్టజెప్పిలైసెన్సులు రెన్యూవల్ తీసుకుంటున్నారు .క్రిందిస్థాయి సిబ్బంది ద్వారా ఈవసూళ్ళ పర్వం నడిచింది. లైసెన్స్కు ఇచ్చే సొమ్ములు తమ ఒక్కరికే కాదని, అందరికీ పంచాలంటూ వ్యాపారులకే లెక్కలు చెబుతున్నారు. డిప్యూటీ కమిషనర్కి ఒక్కో షాపు నుంచి రూ.15,000 ఇచ్చినట్లు లెక్కల్లో చూపించారు. ఈ లెక్కన డిసికి అందిన లంచాలు ఎంత పెద్ద స్థాయిలో ఉన్నాయో... ఇది నిజంగా డిప్యూటీ కమిషనర్కి అందిందా. దీనిపై సూర్యబ్యూరో డిప్యూటీ కమిషనర్ని వివరణ కోరగా అది అంతా అబద్ధం అన్నారు. దీనిపై విచారణ లోతుగా నిర్వహిస్తానని చెప్పారు. ఈ వసూళ్ళ దందాలో ఎవరు ఉన్నా వదిలిపెట్టేది లేదు అన్నారు.

## విశాఖ స్టీల్ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకం రద్దు చేయాలి

**– సెయిల్లో విలీనం చేయాలి... గనులు కేటాయించాలి – సిపిఐ(యం)**



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** విశాఖ స్టీల్ ప్లాంట్ పునర్జీవనానికి 2025 జనవరి 17న కేంద్రం రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనం. ప్యాకేజిని సిపిఎం స్వాగతిస్తున్నది. ఉక్కు సంకల్పంతో విశాఖ ఉక్కు కార్మికులు, రాష్ట్ర ప్రజలు, కార్మికులు, ప్రజాసంఘాలు చేస్తున్న పోరాట ఫలితమిది. ఈ పోరాటంలోను, ఉక్కు రక్షణలోను భాగస్వాములుగా ఉన్న ప్రతి ఒక్కరిని సిపిఎం పార్టీ హృదయపూర్వకంగా అభినందిస్తున్నది. స్టీల్ ప్లాంటు లాభాల బాటపట్టాలంటే స్టీల్ ప్లాంట్ అమ్మే నిర్ణయాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలి. సెయిల్లో విలీనం చేయాలి. సొంతగనులు కేటాయించాలి. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కేంద్రాన్ని ఒప్పించి ఈ ప్రకటన చేయించాలి. ఇది సాధించేవరకు విశాఖ ఉక్కు కార్మికులకు అండగా రాష్ట్ర ప్రజలు, కార్మికులు, ప్రజాసంఘాలు ఈ పోరాటంలో తమ భాగస్వామ్యం కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నామని సిపిఐ(ఎం) నాయకులు పేర్కొన్నారు.

బుధవారం స్టీల్ ప్లాంట్ రక్షణ జాతాకు రావులపాలెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు, జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గా ప్రసాద్, నూకల బలరాం, సిపిఎం కార్య కార్తలు పెద్ద ఎత్తున పాల్గొని జాతా నాయకులకు పూలవర్షంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్యాకేజీతోనే విశాఖ ఉక్కు భవిష్యత్తు మారిపోతున్నట్లు, సమస్య పరిష్కారమైపోయినట్లు ప్రధాని, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మొదలుకొని టిడిపి, జనసేన, బిజెపి కూటమి నేతలు ప్రకటనలు గుప్పిస్తున్నారని, ఈ ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనం అన్న అంశాన్ని మరుగున పరచాలని చూస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, పవన్, కూటమినేతలు స్టీల్ ప్లాంటు అమ్మకం జరగదని ప్రకటిస్తున్నారు, కేంద్రం ప్రకటించడం లేదు. ప్లాంట్ అమ్మకానికి పెట్టింది మోడీ ప్రభుత్వం. కేంద్రమే అమ్మకం రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలి. అప్పుడే విశాఖ స్టీల్ ప్లాంటుకు రక్షణ వుంటుందన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ, మాదకద్రవ్యాల వ్యతిరేకతపై అవగాహన

**– అవగాహనతోనే ప్రమాదాలకు, నేరాలకు దూరం – కాకినాడ ఎస్పి జి బిందు మాధవ్, ఐపీఎస్**



**కాకినాడ, మేజర్న్యూస్ :** ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల( స్వయం ప్రతిపత్తి)లో కళాశాల డిఏఫ్ ఏపీ ఆధ్వర్యంలో కాకినాడ పోలీస్ శాఖ వారిచే సైబర్ సెక్యూరిటీ మరియు మాదకద్రవ్యాల వ్యతిరేకత పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలియజేశారు. కాకినాడ జిల్లా పోలీసు వారిచే ఆదిత్య డిగ్రీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ, మాదకద్రవ్యాల వ్యతిరేకత,రహదారి భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ నియమనిబంధనలను అనుసరించి వాహనాన్ని నడపాలని అన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపీఎస్ మనం చేసే పొరపాటు వలన మన కుటుంబంతోపాటు, ఇతరులు కూడా ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందని కావున తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ వాహనాలను నడపాలని తెలిపారు. హెల్మెట్ ఆవశ్యకత, రేష్ డ్రైవింగ్ వల్ల జరుగుతున్న అనర్థాలను వివరించారు. సైబర్ సెక్యూరిటీ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రభుత్వ సూచనలను పాటించాలని అన్నారు. మోసగాళ్ల వలలో చిక్కుకోకూడదని కొన్ని సంఘటనలను,సోషల్ మీడియాలో జరుగుతున్న మోసాలను ఉదాహరణలతో వివరించారు. " డ్రగ్స్ వద్దు బ్రో" అంటూ యువతకు పిలుపునిచ్చారు. సివిల్ సర్వీసెస్ కి ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు సూచనలు ఇస్తూ, వారు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు 112 నెంబర్కు ఫోన్ చేయవలెనని అన్నారు.

## అంత్యక్రియల సహాయార్థం జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

ఎటపాక, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గౌరీదేవిపేట గ్రామంలో దార రాఘవులు, చింతా నరసమ్మ, సీతాపురం గ్రామంలో గరాటా వీరయ్య, గోగుబాక గ్రామంలో ఈసంపల్లి పెంటయ్య అనారోగ్య కారణాలతో మరణించారు. వారిది చాలా నిరుపేద కుటుంబమని ఈ విషయాన్ని తెలుసుకున్న జమాల్ ఖాన్ మానవతా దృక్పథంతో మరణించిన కుటుంబానికి తలా ఒక 3000 రూపాయలు చొప్పున మొత్తం 12 వేల రూపాయలు మృతుని కుటుంబ సభ్యులకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు, కణితి మధు, శివ కనకరాజు, సర్పంచ్, మారాసు గంగాధర్, జెఎస్పి, శ్రీను, బ్రహ్మం, గంగరాజు, కొండలరావు, లక్ష్మణరావు, భద్రరావు, నాగేశ్వరావు, జెకె సిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పాడి రైతులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి




పెద్దాపురం,మేజర్న్యూస్ : పాడి రైతులు పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ఆనూరు పశు వైద్యురాలు అన్నపూర్ణ నాయుడు ఆధ్వర్యంలో బుధవారం కొండపల్లి గ్రామంలో ఉచిత పశుఆరోగ్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొత్త చక్రరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వెటర్నరి డాక్టర్ అన్నపూర్ణ నాయుడు మాట్లాడుతూ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని, అలాగే ఈ పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పొకనాటి దుర్గారావు, శ్రీకాకోళపు రాజా, దువ్వా రాజా, దువ్వా పాపారావు, పాడి రైతులు, సిబ్బంది అజయ్ సూర్య, అక్షయ్, శేషారావు, నారాయణ, పాల్గొన్నారు. పశువులకు చూడు, గర్భకోశ పరీక్షలు నిర్వహించి, తీసుకోవలసిన జాగ్రత్తలపై పాడి రైతులకు వివరించారు.

## సర్వసభ్య సమావేశం నిర్వహణ తీరుపై విమర్శలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** బుధవారం నిర్వహించిన ఆత్రేయపురం మండల సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొనడంతో పలువురు నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొనడం తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన సర్పంచులు, ఎంపీటీసీలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు సమావేశం నిర్వహించవలసి ఉండగా అందుకు విరుద్ధంగా సర్పంచుల భర్తలు, ఎంపీటీసీల భర్తలు, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొని పలు సమస్యలను ఏకరువు పెట్టడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఎమ్మెల్యే వెంట వచ్చిన పలువురు కొత్తపేట నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల స్థాయి నాయకులు, గ్రామ నాయకులు సమావేశం హాలులో నిబంధనలకు విరుద్ధంగా పాల్గొనడం, పలు సమస్యలు సమావేశంలో ప్రస్తావించడం, సభను సజావుగా నడిపించాలే తప్ప సభ్యులు కానివారిని సమావేశంలో మాట్లాడించడంతో సభ నియమ నిబంధన గాడి తప్పింది అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## స్థానికంగానే ఇళ్ళ స్థలాలు కేటాయించాలని వినతి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తాటిపర్తి గ్రామంలో బుధవారం ఎంపిడిఓ డి.శ్రీలలిత ఆధ్వర్యంలో గ్రామంలో ఇళ్ళ స్థలాల లబ్దిదారుల అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లబ్దిదారులు పాల్గొని మాట్లాడుతూ తమకు తమ గ్రామ పరిధిలోనే ఇళ్ళ స్థలాలు కేటాయించాలని, గత ప్రభుత్వ హాయాంలో సుదూరంగా ఇళ్ళ స్థలాలు ఇవ్వడం వలన, అక్కడ నీటి సదుపాయం, కరెంటు సదుపాయం లేదని కావున మా గ్రామ పరిధిలోని మాకు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని లబ్దిదారులు అధికారులను కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కొమ్మిరెడ్డి బుజ్జి, రామిశెట్టి శ్రీను, పేపకాయల తిరుపతిరావు, ఎగ్గాడ సత్తిబాబు, నామా వీరభద్రరావు, ద్వారంపూడి చెల్లారావు, కొమ్మిరెడ్డి నాగ సుబ్రహ్మణ్యం, పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, ఇఓ & పిఆర్డి బి.వి.వి.రమణ, పంచాయితీ సెక్రటరీ షావలి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

